క్లుప్తంగా

కలెక్టర్, జేసీలతో ఎమ్మెల్యే భేటీ



జేసీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు భేటీ అయ్యారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. పూతలపట్టు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు.

నేడు గుండ్లపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం

ఐరాల: మండలంలోని గుండ్లపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరవుతారని చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు.

గుడిపాలకు చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

గుడిపాల : జగనన్న విద్యాకానుకలో భాగంగా వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు గురువారం మండల కేంద్రానికి ప్రభుత్వం చేరవేసింది. పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలను అందజేయనున్నట్లు ఎంఈవో రామ్‌నాయక్ తెలిపారు. మొత్తం 22,161 పాఠ్యపుస్తకాలు కావాల్సి ఉండగా మొదటి విడతలో 11వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు వివరించారు. మిగతా పుస్తకాలు త్వరలో వస్తాయని వివరించారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. ఏఎల్ పురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె షుగర్, బీపీ, గర్భిణులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారా పట్టివేత



వ్యక్తిని అరెస్ట్ చూపిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళెం మండలంలో గురువారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి చిలగుండ్లపల్లెకు చెందిన రవి (45)ని పట్టుకున్నారు. ఆయన నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిశ్రమలతో ఉపాధి

శ్రీరంగరాజపురం: పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ సీనియర్ అసిస్టెంట్ నీరజ అన్నారు. ఆమె గురువారం తహసీల్దార్ లోకనాథ పిళ్లైతో కలసి మండలంలోని శెట్టివానత్తం, ఎస్సార్‌పురం ప్రాంతాల్లో బెల్లం ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. బెల్లం ఫ్యాక్టరీ నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి అవసరమని, స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా మహిళలకు 2 వేల మంది వరకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మురళి, ఆర్ఐ త్యాగరాజులు, ఏపీఎం రోజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులు బలోపేతం

కార్వేటినగరం: ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి ప్రభుత్వ పటిష్ట చర్యలు చేపడుతోంది. నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సర్వశిక్షణ అభియాన్ ఈఈ మధుసూదన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల, ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరం లోపు నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. నాడు–నేడు పనులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తోందని గుర్తు చేశారు. హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం, స్కూళ్ల హెచ్‌ఎంలు పలువురు ఉన్నారు.

ఇంటింటా సంక్షేమ పంట

చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు దిల్‌షద్. మండలంలోని బీఎన్ఆర్‌పేట గ్రామం. ప్రస్తుత ప్రభుత్వంలో ఈమె పక్కా ఇల్లు కట్టుకున్నారు. ఆసరా కింద ఏడాదికి రూ.8,900 అందుతోంది. సున్నావడ్డీకూడా వస్తోంది. కుమార్తె వలంటీరుగా, కుమారుడికి అమ్మఒడి కింద లబ్ధి పొందుతున్నారు. ప్రధానంగా వైఎస్సార్ చేయూత కింద తొలి విడతగా వచ్చిన రూ.18,750 ఇతర అవసరాలకు ఖర్చు చేయకుండా పిండిమిషన్ కొనుగోలు చేసుకున్నారు. దీంతో ప్రతిరోజు రూ.250 నుంచి రూ.500 వరకు ఆదాయం పొందుతున్నారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు శంకరమ్మ. బీఎన్ఆర్‌పేట గ్రామ నివాసితురాలే. ఒంటరి మహిళ. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇంటి కలను నెరవేర్చుకుంది. ప్రభుత్వ సాయంతో పక్కా ఇల్లు నిర్మించుకుంది. వైఎస్సార్ చేయూత కింద ఇప్పటి వరకు 37,500 వరకు లబ్ధి పొందింది. సున్నా వడ్డీ రూ.4,798 రాగా, ఆసరా కింద రూ.24,030 చేతికొచ్చింది. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ఇప్పటి వరకు రూ.82,000 తీసుకున్నారు. నాలుగేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.3,98,328 లబ్ధి పొందామని శంకరమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది. తాము ఎల్లప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పేర్కొంది.



జగనన్న ప్రభుత్వం వచ్చాక పేదల ఇంట పథకాల పంట పండాయి. అర్హత ఉంటే పథకాలే గడపను వెతుక్కుంటూ వస్తున్నాయి. ఇందులో దళారుల దందా లేదు. అధికారుల, సిబ్బంది చేతివాటం లేదు. పారదర్శకంగా పలు రకాల పథకాలు నేరుగా లబ్ధిదారులకే వరిస్తోంది. ఈ లబ్ధితో చాలా మంది ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసుకున్నారు. మరికొందరు కష్టాలను పూడ్చుకుంటున్నారు. బీఎన్ఆర్‌పేట సచివాలయ పరిధిలోని బీఎన్ఆర్‌పేట, అనంతాపురం, కుర్చివేడు పంచాయతీవాసులు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



- పేదల ముంగిట్లో పథకాల ఫలాలు
- మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న వైనం

చిత్తూరు రూరల్: మండలంలోని బీఎన్ఆర్‌పేట సచివాలయ పరిధిలో బీఎన్ఆర్‌పేట, కుర్చివేడు, అనంతాపురం పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో 1,086 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం జనాభా 3,455 మంది ఉండగా ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు 2,992 మంది ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో కేవలం టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే పథకాలు వచ్చాయి. ఇళ్లు, రేషన్‌కార్డులు వంటివన్నీ జన్మభూమి కమిటీ అనుమతుల మేరకు వచ్చేవి. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి నుంచి ఇప్పటి వరకు సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకానికి పెద్ద పీట వేశారు. వలంటీర్ల చేత ఆ పథకాలను అర్హుల గడపవద్దకే చేరుస్తున్నారు. అవినీతి, అక్రమాలకు చోటులేకుండా చేస్తున్నారు. దీంతో అందిన ఫలాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు. కష్టాల నుంచి గట్టెక్కుతున్నారు.



రూ.4 లక్షల మేర లబ్ధి పొందాం

సీఎం అన్ని విధాలుగా బాగు చేస్తున్నారు. పేదలను గుర్తిస్తున్నారు. ఆర్థికంగా ఆదుకుంటున్నారు. జగనన్న సీఎం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.4,04,750 పొందాం. వైఎస్సార్ చేయూత కింద రూ.56,250, రైతు భరోసా రూ.40,500, పింఛన్ రూ.1,08,000, హౌసింగ్‌కు రూ.2 లక్షల వరకు వచ్చింది. ఆ డబ్బులు చేతికి ఇవ్వకుండా నేరుగా ఖాతాలోనే జమ చేస్తున్నారు. **– అరుణ, అనంతాపురం**

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 11 గంటలకు ఆలయ ఆవరణలో సుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. సాయంత్రం నుంచి భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారి ప్రాకారోత్సవం ఉంటుందని చెప్పారు.


బంగారు నగలపై రుణం

బంగారుపాళెం: స్థానిక జిల్లా సహకార బ్యాంకులో బంగారు నగలపై రుణాలు అందించనున్నట్లు ఆ శాఖ చీఫ్ మేనేజర్ గంగిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగారు నగలపై సాధారణ రుణం కింద గ్రాముకు రూ.4,200, వ్యవసాయ రుణం కింద గ్రాముకు రూ.4 వేలు ఇస్తున్నట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రశేఖరపురం పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందిన రైతులు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్సు కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్ అందజేయాలని సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, సీఈఓ రామూర్తి తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యేకు వినతి

చిత్తూరు కార్పొరేషన్: అర్హులైన బడుగు, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో చిత్తూరు రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 2018లో తేనెబండ గ్రామం సర్వేనెంబరు–285లో ప్రభుత్వ భూమిలో స్థలాలు పొందిన పేదలు అక్కడ ఇంటి నిర్మాణం కోసం పలువురు పునాది వేసుకున్నారని చెప్పారు. ఆ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు వస్తాయని ఇంటి లబ్ధిదారులకు మరో ప్రాంతంలో స్థలం మంజూరు చేస్తామని 2019లో రెవెన్యూ అధికారులు వారిని ఖాళీ చేయించారన్నారు. తమకు ఇంటి స్థలం కేటాయించాలని మూడేళ్లుగా వారు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ అంశంపై కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మణి పాల్గొన్నారు.

బుద్ధుని చిత్రలేఖనం అపురూపం



సందోహదోల



ఆహ్వానం



తథాగతుడు

యాదమరి: బుద్ధ పౌర్ణమి సందర్భంగా బుద్ధుని జీవితంలో అపురూప ఘట్టాలను స్థానిక ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచ్చారి చిత్రలేఖనం ద్వారా ఆవిష్కరించారు.

సందోహదోల : సిద్ధార్థుడు జన్మించిన పిదప ఆస్థాన జ్యోతిష్యులు సిద్ధార్థుడు కపిలవాస్తు, చక్రవర్తి అవుతాడని లేదా గొప్ప సన్యాసిగా మారి జ్ఞాన బోధ చేశారని ప్రతీతి. తండ్రి శుద్ధోదన మహారాజు సిద్ధార్థుని తొలి జన్మదిన వేడుక సందర్భంగా అన్యమనస్కంగా సిద్ధార్థుని దీవించు సన్నివేశం చిత్రలేఖనం.



దామోదరాచ్చారి, మాస్టర్

ఆహ్వానం: గౌతమ బుద్ధుడు వైశాలీ నగరం విచ్చేసినప్పుడు ఆమ్రపాలి అనే వేశ్య బుద్ధుని ఆతిథ్యమునకు ఆహ్వానించు సన్నివేశమే ఈ చిత్ర లేఖనం.

తథాగతుడు: ఏడు సంవత్సరముల తర్వాత కపిలవాస్తు ప్రవేశించిన బుద్ధుడు చిత్రలేఖనం

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో కొలువు మాతమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బెస్తపల్లె జాతరకు హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పేదల కోసమే ఫ్యామిలీ ఫిజీషియన్



ఎగువ మత్యంలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ప్రభుత్వం పేదల కోసమే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎగువ మత్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ వ్యానులో గర్భిణులకు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన అవసరం

గుడిపాల: సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇందిరా క్రాంతి పథం ఏపీఎం ఈశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో గురువారం సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇకపై లోకోస్ యాప్‌లో స్వయం సహాయక సంఘాల వివరాలన్నింటితోపాటు సభ్యుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని తెలియజేశారు. లోకస్ యాప్ ద్వారా భారతదేశంలో ఎక్కడ నుంచైనా స్వయం సహాయక సంఘాల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ సంఘం సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని నాడు–నేడు పనులను పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం బడులను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వాటిపై దృష్టి పెట్టి నాడు–నేడు కిందనున్న పాఠశాల పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అంతేకాకుండా మండలంలో ఇప్పటి వరకు 907 ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని పేట అగ్రహారం సచివాలయాన్ని తనిఖీ చేశారు. పనివేళకు ప్రాధాన్యత ఇవ్వాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలన్నారు. పర్యటనకు వెళితే కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ ఖాదర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నిజం చేసుకోండి



లేవుట్ పరిశీలనలో మేయర్ అముద

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొని సొంతింటి కలను నిజం చేసుకోవాలని నగర మేయర్ అముద కోరారు. మేయర్ గురువారం నగరపాలక సంస్థ పరిధిలో అనుప్పల్లి హౌసింగ్ లేఅవుట్లను సందర్శించారు. లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల స్థలాలు పొందిన వారంతా నిర్మించుకునేలా చూడాలని హౌసింగ్, అమినిటీ కార్యదర్శులకు సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించి వేగంగా నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న పలు గృహాలను పరిశీలించారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని మేయర్ చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరుధాన్యాలపై అవగాహన అవసరం



చిరుధాన్యాల ప్రదర్శనలో స్వయం సహాయక సంఘ సభ్యులు

గుడిపాల: చిరుధాన్యాల ఆవశ్యకత, అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం అని ఐకేపీ ఏపీయం ఈశ్వరి, వెలుగుసీసీ లోకనాథరెడ్డి అన్నారు. పాపసముద్రం, మరకాలకుప్పం, బసవాపల్లె, కేజే పురం పంచాయతీలో గురువారం స్వయం సహాయక సంఘ గ్రూపులకు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2023ను ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శించారు. చిరుధాన్యాల ఆవశ్యకత, ఆరోగ్య ప్రయోజనాలు మొదలైన విషయాలపై తెలియజేశారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలు ప్రోత్సహించిన ఉత్తమ గ్రూపులకు బహుమతులు అందజేశారు.

అడవిలో రాజుకునే అగ్నికి కళ్లెం



అడవిలో మంటలు(ఫైల్)

- అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- ఫైర్ వాచర్లతో పర్యవేక్షణ

చిత్తూరు కార్పొరేషన్: ఎండా కాలంలో అడవులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు అటవీశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టంగా నిఘా పెడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా పలువురు అధికారులకు విధులు కేటాయించింది. అటవీ సంరక్షణ, అక్రమ రవాణా కట్టడికి గ్రామాల్లో కళాజాతా బృందాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేసేందుకు అటవీశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా 11 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరు పెట్రోలింగ్ చేయడంతోపాటు అడవిలో పరిస్థితులను గమనిస్తుంటారు. వారికి కావాల్సిన నీళ్ల బాటిళ్లు, బూట్లు, డ్రెస్, సేఫ్టీకిట్స్‌ను అందించారు. వీరు జిల్లాలో పెట్రోలింగ్ చేస్తుంటారు. అటవీ ప్రాంతంలో మంటలను శాటిలైట్ సహకారంతో డీఎఫ్ఓలు ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. మంటలను అదుపు చేయడానికి వీలుగా అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంటలు వ్యాపించకుండా ఆర్పేందుకు వీలుగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. చెట్ల వద్ద ఎండుటాకులను తొలగిస్తున్నారు. దీంతో మంటలు ఎక్కడికక్కడ ఆగిపోయే అవకాశం ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు.

ఈ ఏడాది వర్షాలు కురుస్తుండడంతో ప్రస్తుతం నీటి ఎద్దడి లేదు. అయినప్పటికి వేసవి కారణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

రేంజ్‌లు –	6
సెక్షన్లు –	24
బీట్లు –	84
అటవీ విస్తీర్ణం –	1.95 లక్షల హెక్టార్లు
మండలాలు –	31
ఫైర్‌లైన్ ఏర్పాటు –	46 కిలోమీటర్లు
ప్రత్యేక బృందాలు –	14

బాధ్యతగా ఉండాలి



అడవులకు నిప్పు పెట్టడం సరదాగా భావించవద్దు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. అగ్ని ప్రమాదాల వల్ల జీవజాతులకు ముప్పు వాటిల్లి పర్యావరణ దెబ్బతింటుంది. ప్రజల్లో వీటిపై చైతన్యం రావాలి. అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశాం **– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్ఓ**

పంటలకు అడవి పందుల బెడద



బొమ్మసముద్రంలో ఆకుకూర తోట రక్షణకు కట్టిన చీరలు

గుడిపాల: రెక్కలు ముక్కలు చేసుకుని కూరగాయల పంటలు సాగుచేస్తున్న రైతులు అడవి పందుల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయల తోటలను రాత్రిళ్లో పందులు గుంపులుగా వచ్చి నాశనం చేస్తున్నాయి. దీంతో కొందరు వారి బారినుంచి రక్షించేందుకుగాను ఇనుపతీగలు, చీరలు వంటివి ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వరి, రబీ సీజన్‌లో కూరగాయల పంటలను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. ప్రస్తుతం చిత్తపార, బండపల్లె, చింతగుంటూరు, పేయనపల్లె, 197రామాపురం, ఏఎల్ పురం, వసంతాపురం, బొమ్మసముద్రం, గొల్లమడుగు తదితర గ్రామాల్లో కూరగాయల పంటలను పందులు నాశనం చేస్తున్నాయి. దీంతో కొందరు రైతులు గత్యంతరం లేక ఇనుపతీగలు, చీరలు, కొయ్యలకు ఏర్పాటు చేసుకుని అడవి పందుల బారి నుంచి రక్షించుకుంటున్నారు.